సాక్షి ఏలూరు

గురువారం । 4 । జనవరి । 2024



పంచారామంలో కేంద్ర మంత్రి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం సోమేశ్వర జనార్దన స్వామిని బుధవారం కేంద్ర మత్స్య, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా దర్శించుకున్నారు.



రూ.18.88 లక్షల ఆదాయం

పెదవేగి: శ్రీ రాట్నాలమ్మ హుండీని భక్తుల సమక్షంలో దేవస్థాన సిబ్బంది లెక్కించారు. 125 రోజులకు రూ.18,88,879 ఆదాయం లభించింది.

పారిజాతగిరిలో ధనుర్మాస ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం: పారిజాత గిరి ఆలయంలో ధనుర్మాస ఉత్సవంలో 18వ రోజు గోదాదేవికి, పద్మావతి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు నల్లూరు రవికుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.



న్యూస్‌రీల్

పెన్షన్ పెంపు చారిత్రాత్మకం



కోటగిరి శ్రీధర్, ఏలూరు ఎంపీ

దెందులూరు: పాదయాత్రలో పెన్షన్ రూ.3 వేలు చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఏలూరు జిల్లాలో కొత్తగా 4096 మందికి పెన్షన్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం ఎంపీగా తనకు సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో 2,72,955 మందికి అన్ని రకాల పింఛన్లకు నెలకు రూ.81.53 కోట్లు ఇస్తున్నారన్నారు.

6న మహిళా మార్ట్ ప్రారంభం



కలెక్టర్‌కు ఆహ్వానాన్ని అందజేస్తోన్న నూజివీడు మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు

నూజివీడు: నూజివీడు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ఈనెల 6న ప్రారంభిస్తున్నందున మహిళా సమాఖ్య పాలకవర్గ సభ్యులు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి ఆహ్వానించారు. వైఎస్ఆర్ చేయూత మహిళా మార్ట్ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను కలెక్టర్‌కు అందజేశారు. మండలంలోని 62 గ్రామైఖ్య సంఘాల్లోని 18,643 సభ్యులు ఒక్కొక్కరు రూ.200 వాటా ధనంతో రూ.36 లక్షల పెట్టుబడితో వైఎస్ఆర్ చేయూత మహిళా మార్ట్ ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

కాళికాంబ మృతి తీరనిలోటు



మాజీ ఎమ్మెల్యే పరకాల కాళికాంబకు నివాళులర్పిస్తున్న చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం: మాజీ ఎమ్మెల్యే పరకాల కాళికాంబ మృతి తీరని లోటని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కాళికాంబ మృతికి బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పరకాల శేషావతారం మంత్రి చెన్నారెడ్డి, నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గాల్లో కీలక శాఖలు నిర్వహించారని గుర్తు చేశారు. భర్తకు అండగా ఉన్న కాళికాంబ తరువాత భర్త మృతితో రాజకీయల్లోకి అడుగుపెట్టి విజయపరంపర కొనసాగించారని చెప్పారు. పరకాల కుటుంబం నరసాపురం అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. సీనియర్ నేత, వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు మాట్లాడుతూ శేషావతారం, కాళికాంబలతో కలిసి పనిచేసిన రోజులు గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాబ్జి, పార్టీ సీనియర్ నేతలు అందే భుజంగరావు, కామన బుజ్జి, షేక్ బులిమస్తాన్, అయితం ధనలక్ష్మి, బర్రి శంకరం, పప్పుల రామారావు తదితరులు పాల్గొన్నారు. తెలగా కళ్యాణమండపంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు ఆధ్వర్యంలో కాళికాంబ మృతికి సంతాప సభ నిర్వహించారు.

అభ్యంతరాల స్వీకరణ

ఏలూరు(మెట్రో): అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 9 లోగా తెలియజేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ శాఖలో అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి 12 టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులను నియమించుకునేందుకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ జాబితాకు సంబంధించి అభ్యంతరాలను ఈ నెల 9 లోపు స్వయంగా ఏలూరు కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారికి పూర్తి వివరాలతో అందజేయాలన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమాల్లో 1597 మంది వైద్య సేవలు పొందారని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఏలూరులో 433, జంగారెడ్డిగూడెంలో 273, నూజివీడులో 370, చింతలపూడిలో 521 ఓపీ కేసులు నమోదయ్యాయన్నారు. ఇందులో 709 మంది పురుషులు కాగా, 888 మంది మహిళలు ఉన్నారన్నారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గతంలో పొందిన వైద్య సేవలకు అనుసంధాన వైద్య సేవలు లక్ష్యంగా నిర్దేశించామన్నారు.

అపూర్వ 'స్పందన'

- అర్జీల పరిష్కారంలో అధికారుల చిత్తశుద్ధి
- ఏలూరు జిల్లాలో గతేడాది 10,049 ఫిర్యాదుల పరిష్కారం
- వివిధ దశల్లో 1,308 ఫిర్యాదులు



పట్టదారు పాస్ పుస్తకాన్ని అర్జీదారునికి అందిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్ (ఫైల్)

ఏలూరు(మెట్రో): ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం వారి సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించేలా స్పందన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజల ఫిర్యాదుల్ని తెలుసుకుని వాటిని తక్షణం పరిష్కరించేలా చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా స్పందనను జిల్లా కేంద్రమైన కలక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహిస్తోంది. అలాగే ప్రతి మండల కేంద్రంలో, డివిజన్ కేంద్రంలోను అధికారులు స్పందన ఫిర్యాదులు స్వీకరిస్తూ ప్రజా సమస్యలపై దృష్టిసారిస్తున్నారు.

వీలైనంత త్వరగా పరిష్కరించేలా..

జిల్లావ్యాప్తంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి గత ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు 8,810 ఫిర్యాదులు, దరఖాస్తులు అందాయి. ప్రతి సోమవారం మండల, డివిజన్ కేంద్రాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమానికి 2,547 ఫిర్యాదులు అందాయి. మొత్తం 11,357 ఫిర్యాదులు అందగా, వాటిని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వాటి పరిష్కారానికి గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు దృష్టి కేంద్రీకరించి వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టారు.

598 రీ ఓపెన్ ఫిర్యాదుల పరిష్కారం

మొత్తం 11,357 ఫిర్యాదుల్లో 10,049 ఫిర్యాదులు పరిష్కరించగా, 1308 ఫిర్యాదులు వివిధ దశల్లో ఉన్నాయి. వాటిని కూడా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో రీ ఓపెన్ చేసిన ఫిర్యాదుల్లో 8 ఇంకా పరిష్కారం కావాల్సి ఉండగా.. 598 రీ ఓపెన్ చేసిన ఫిర్యాదులు అధికారులు పరిష్కరించారు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా గత ఏడాది కాలంలో ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తున్న జిల్లా అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

కలెక్టర్ పర్యవేక్షణలో.. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటూ ఫిర్యాదుల్ని పరిశీలిస్తున్నారు. పరిష్కార తీరుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారో లేదో అని పరిశీలిస్తున్నారు. సంబంధిత అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తే తక్షణమే సంబంధిత ఫిర్యాదుపై నేరుగా కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేక స్పందన ఏర్పాటు చేసి ఆయా సమస్యలపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే నూజివీడు, ఉంగుటూరు, చింతలపూడి, కైకలూరు వంటి నియోజకవర్గాల్లో స్పందన కార్యక్రమాన్ని పూర్తి చేసి ప్రజా సమస్యలను స్వీకరిస్తూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



జిల్లాలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సమస్య తీవ్రత మేరకు 24 గంటల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సమస్యల పరిష్కారంపై నిత్యం పర్యవేక్షణ చేపడుతూ ఎప్పటికప్పుడు నివేదిక పరిశీలిస్తూ ప్రజలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఫిర్యాదు అందిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం దృష్టి కేంద్రీకరిస్తుంది.

– వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్

అర్జీదారుల కృతజ్ఞతలు



జాయింట్ కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న వైఎస్సార్ కాలనీ వాసులు (ఫైల్)

జగనన్నకు చెబుదాం స్పందన అర్జీ ద్వారా 24 గంటల్లోనే సమస్యను పరిష్కరించి ఏలూరు వైఎస్సార్ కాలనీలో విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేయడం పట్ల ఆ కాలనీ వాసులు నేరుగా జాయింట్ కలెక్టర్ లావణ్య వేణికి కృతజ్ఞతలు తెలుపుతూ పుష్పగుచ్ఛాలు అందించారు. జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల పరిష్కారంలో అత్యంత శ్రద్ధ చూపిన అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించడంతో పాటుగా, సమస్య పరిష్కార పత్రాలను ఫిర్యాదిదారులకు కలెక్టర్ చేతుల మీదుగా అందిస్తున్నారు. అక్టోబర్ నెలలో భీమడోలు మండలానికి చెందిన ఎస్.చంద్రిక మణీశ్వరి పట్టాదారు పాస్‌పుస్తకానికి అర్జీపెట్టుకోగా పాస్‌పుస్తకం మంజూరు చేస్తూ సంబంధిత అర్జీ పత్రాన్ని చంద్రికమణీశ్వరికి కలెక్టర్ అందజేశారు. చింతలపూడి మండలానికి చెందిన పి.వెంకటేశ్వరరావు పట్టాదారు పాస్ పుస్తకానికి అర్జీ పెట్టుకోగా, సంబంధిత పాస్ పుస్తకాన్ని కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు అర్జీదారుడికి అందించారు.

12 వరకూ ఓటర్ల నమోదు చేపట్టాలి

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్



కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): భారత ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితా విడుదల గడువు పొడిగించినందున జనవరి 12 వరకు ఓటర్ల నమోదుకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సంబంధించిన అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2024, ఇతర ఎన్నికల అంశాలపై రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలెక్టర్ బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి 12 వరకు ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ చేపట్టాలన్నారు. డిసెంబరు 9 తర్వాత అందిన ప్రతి క్లైయిమ్‌ను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో 2024 జనవరి 2 నాటికి 16,23,530 మంది ఓటర్లుగా నమోదయ్యారని చెప్పారు. ఇంతవరకు 7,787 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వాటిలో ఫారం–6 కింద 2,028, ఫారం–7 కింద 3,086, ఫారం–8 కింద 2,673 దరఖాస్తులు ఉన్నాయన్నారు. ఓటర్లను చైతన్యం పరిచేందుకు స్వీప్ కార్యక్రమాలను కూడా చేపట్టామని ఈ కార్యక్రమాల్లో కూడా రాజకీయ పక్షాల ప్రతినిధులు కూడా పాల్గొనాలని సూచించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లో మౌలిక సదుపాయాలను తనిఖీ చేయాలని ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలను ఆదేశించామన్నారు.

పెన్షన్ల పండుగ



వైఎస్సార్ పెన్షన్ కానుక చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): వైఎస్సార్ పింఛన్ కానుక కింద జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల పెన్షన్లకు సంబంధించి జనవరి నెలకు 2,72,955 మందికి రూ. 81.53 కోట్లు విడుదల చేశామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. బుధవారం వైఎస్సార్ పెన్షన్ కానుక రూ. 3 వేలు అందించే కార్యక్రమంలో భాగంగా కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొనగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ,, పెన్షన్ లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ నెల 8 వరకు ఆయా మండలాలు, మున్సిపాలిటీల్లో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 2,26,426 మంది పెన్షన్లకు గాను పెంచిన మొత్తం కింద ప్రతి నెలా అదనంగా రూ. 5.66 కోట్లు అందజేస్తున్నామన్నారు. జనవరి నెల నుంచి కొత్తగా మంజూరు చేసిన 4,096 పెన్షన్లు ఉన్నాయన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 2019 నుంచి ఇప్పటి వరకు 1,08,905 కొత్త పెన్షన్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంజూరు చేశారన్నారు. పెన్షన్ పెంపుతో మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని నూరు శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో పెన్షన్ మంజూరు కావాలంటే ఎన్నో కష్టాలు ఉండేవని, జగనన్న ప్రభుత్వం వచ్చాక పారదర్శకంగా ఇంటి తలుపుతట్టి వలంటీర్లు పెన్షన్ అందిస్తున్నారన్నారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ డా.ఆర్.విజయరాజు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.పుష్పలత, ఎస్‌ఈ కార్పొరేషన్ ఈడీ కుముదినీసింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేయడం తోపాటు మరికొంతమంది లబ్ధిదారులకు జనవరి నెల పెన్షన్ మొత్తాన్ని అందజేశారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక అవగాహనపై గోడపత్రికలను ఆవిష్కరించారు.

ప్రేమ స్వరూపిణి సావిత్రి బాయి పూలే

ఏలూరు (టూటౌన్): కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి సావిత్రి బాయి పూలే అని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ కొనియాడారు. స్థానిక జెడ్పీ సెంటరులోని పూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మి మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించి ప్రాణా లను సైతం లెక్కపెట్టకుండా సమష్టిగా పోరాటం చేసిన మహనీయురాలని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కెఎస్ఎస్ సుబ్బారావు, డిప్యూటీ సీఈఓ ఎస్.నిర్మలాజ్యోతి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా లోకానికి ఆదర్శనీయురాలు

భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక వేత్త సావిత్రి బాయి పూలే నేటి మహిళా లోకానికి ఆదర్శనీయురాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని కొనియాడారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం సావిత్రి బాయి జయంతి కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా సావిత్రి బాయి పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే ఆళ్ల నాని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటి బ్రిటీష్ హయాంలోనే స్త్రీల విముక్తి, హక్కులు, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడంతో పాటు స్త్రీ విద్యకు కంకణం కట్టుకున్న మహనీయురాలని గుర్తు చేశారు.



క్యాంపు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, బీసీ ఉద్యోగ సంఘాల నాయకులు



పూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఈ కార్యక్రమంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ నెర్సు చిరంజీవి, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, బీసీ నాయకులు అబ్బిరెడ్డి రంగ ముత్యాలు, ఈదలాడ నాని, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్ఆర్ విఠల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడపాలి

డీఈఓ శ్యామ్ సుందర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నత లక్ష్యాలవైపు నడిపించాలని, వారికి తగిన దిశానిర్దేశం చేసి వారు సత్ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పీ శ్యామ్ సుందర్ సూచించారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర డైరీలు, టేబుల్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి వినూత్నమైన పథకాలను అందిస్తుందన్నారు. వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న కృషి కారణంగా రాష్ట్రం ప్రభుత్వ విద్యారంగంలో దేశంలోనే అగ్రగామిగా దూసుకుపోతోందన్నారు. వైఎస్ఆర్ టీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ జీజేఏ స్టీవెన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పగడాల సాంబశివరావు, బీ. రామ్మోహనరావు, తోట ఎడ్వర్డ్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ డైరీ ఆవిష్కరిస్తున్న డీఈఓ శ్యామ్ సుందర్

ఆరోగ్యశ్రీలో రూ. 25 లక్షల వైద్య సేవలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి రక్షణ అని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక వీకర్స్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో ఆరోగ్యశ్రీలో రూ. 5 లక్షల వైద్యం అందించేవారని, ఇప్పుడు ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ కార్డులు అందించి వాటి ద్వారా రూ. 25 లక్షల వరకు అవసరమయ్యే వైద్య సేవలను ఉచితంగా ఆరోగ్యశ్రీపరిధిలో ఉన్న కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందజేస్తున్నారన్నారు. దానికి తగినట్టుగానే పేదలకు ఉచితంగా వైద్యం అందించేందుకు ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులను ప్రతీ నెలా ఉచితంగా అందచేస్తున్నామన్నారు. ఆరోగ్య సురక్ష ప్రతి బుధవారం



ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ఒక్కో వార్డులో నిర్వహిస్తారన్నారు. దీనిని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. వైద్యచికిత్స అవసరమైన వారు ముందుగా తమ వార్డు వలంటీర్లు వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకానికి ఆయన తనయుడు జగన్‌మోహనరెడ్డి మరింత వన్నె తెచ్చారన్నారు. 108 వాహనాలను వైఎస్సార్ ప్రవేశపెడితే తెదేపా ప్రభుత్వంలో కనీసం పెట్రోలు బకాయిలు కూడా చెల్లించకుండా 108 వాహనాలను నిర్జీవం చేశారన్నారు. ఆరోగ్య శ్రీ కార్డులను 1, 2 వార్డుల ప్రజలకు మంత్రి కొట్టు చేతుల మీదుగా అందచేశారు. ఆర్‌డీఓ, ప్రత్యేక అధికారి చెన్నయ్య మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా ప్రతి వాలంటీరు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం, వైద్యులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. వైద్యుడు రవికుమార్ ఆరోగ్య సురక్ష శిబిరాల్లో అందచేస్తున్న సేవల వివరాలను తెలిపారు. కార్యక్రమంలో మునిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి సామ్యూల్, నాయకులు శీలి మేరీకుమారి, బోళం రామలక్ష్మి, పత్మట్ల సావిత్రి, గుండుబోగుల నాగు, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, కర్నాటి కన్నయ్య, కోడే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకే మా కుటుంబం అంకితం

పోలవరం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ తెల్లం రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన తెల్లం రాజ్యలక్ష్మి.. ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతో కలిసి బుధవారం బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. తీన్మార్ డప్పులతో పూలు చల్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాసేవకే తమ కుటుంబం అంకితమని అన్నారు. నిరంతరం ప్రజలకు తాను అందుబాటులో ఉంటానని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో తన వంతు కృషి చేస్తానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పోలవరం ఎమ్మెల్యే సీటును గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామన్నారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయురాలు కావడంతో తడబడకుండా సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలకు తాను ఏం చేస్తాననేది స్పష్టంగా చెప్పారు. రాజ్యలక్ష్మి స్పీచ్‌తో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో జోష్ పెరిగింది. తొలిత దుద్దుకూరు సమీపంలో ఉన్న వైఎస్సార్, దివంగత తెల్లం చిన్నవడ్డీ విగ్రహాలకు బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పెద్దల ఆశీర్వాదం తీసుకుని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



తెల్లవారిగూడెంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

అంగన్‌వాడీలు విధులకు హాజరుకావాలి

ఏలూరు(మెట్రో): ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మె విరమించాలని, జనవరి 5 లోగా విధులకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించి కొన్ని కోర్కెలు అంగీకరించిన విషయాన్ని గ్రహించాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉందన్నారు. విధులకు హాజరు కాకపోవడంతో పోషకాహార కిట్లు, గుడ్లు, పాలు, సప్లిమెంటరీ న్యూట్రిషన్ లబ్ధిదారులకు అందడం లేదన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సేవలు కొనసాగించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. సమ్మె కారణంగా బాలింతలు, గర్భిణులు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులను పడుతున్నారన్నారు.

8న అప్రెంటీస్ మేళా

ఉండి: పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 8న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో వివిధ కోర్సులు పూర్తి చేసిన వారంతా ఈ అప్రెంటీస్ మేళాకు నేరుగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావచ్చన్నారు. ఇతర వివరాలకు 88863 39666 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని శ్రీనివాసరాజు తెలిపారు.

క్లుప్తంగా

నేత్రపర్వంగా శ్రీవారి తిరువీధి సేవ



తొళక్క వాహనంపై ఉభయ దేవేరులు, గోదా దేవితో క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ధనుర్మాసోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. వీటిని పురస్కరించుకుని స్వామివారికి నిర్వహిస్తున్న తిరువీధి సేవలు భక్తులకు నేత్రపర్వం అవుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించిన తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా తిరువీధులకు పయనమైంది. డోలు, సన్నాయి వాయిద్యాలు, అశ్వ, గజ సేవలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలతో శ్రీవారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ప్రతి ఇంటి ముంగిట భక్తులు స్వామివారికి నీరాజనాలు సమర్పించారు. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు విశేష పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు

జంగారెడ్డిగూడెం: ఆన్‌లైన్ ద్వారా నగదు పోగొట్టుకున్న ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ డీఎస్పీ బి.విద్య చెప్పారు. ఆమె తెలిపిన వివరాలు ప్రకారం.. పట్టణానికి చెందిన బండి మణీంద్రరావుకు గత ఏడాది డిసెంబర్ 6న టెలిగ్రామ్ యాప్‌లో ఒక లింక్ వచ్చింది. ఆ లింక్ ఓపెన్‌చేసి చూడగా, జ్యూయలరీకి సంబంధించిన వీడియోలు వచ్చాయి. ఆ వీడియోలో తనకు లాభాలు వస్తాయని చెప్పగా, మణీంద్రరావు పిన్ నంబర్‌ను ఉపయోగించి నగదును బదిలీ చేశాడు. ఇలా ఐదు సార్లు మొత్తంగా రూ. 59,440 బదిలీ చేశాడు. ఆ తరువాత నుంచి ఆ యాప్ ద్వారా ఎటువంటి సమాచారం రాకపోవడంతో తాను మోసపోయానని గుర్తించి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు.

మురిపించెన్



పోలవరం : పోలవరంలో లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

ఏలూరు జిల్లాలో వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ చురుగ్గా సాగుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గతంలోనే ఇచ్చిన హామీ అమలులో భాగంగా పింఛను సొమ్మును రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచి అందజేస్తోంది. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 8వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లాలో పలు చోట్ల ఎమ్మెల్యేలు లబ్ధిదారులకు పింఛన్ల సొమ్మును అందజేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



ద్వారకాతిరుమల : లబ్ధిదారులకు పింఛను సొమ్మును అందిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



చింతలపూడి: చింతలపూడి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



ముదినేపల్లి రూరల్: ముదినేపల్లిలో ఆరోగ్యశ్రీ కార్డు, పెన్షన్ సొమ్ము పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ



నూజివీడు : నూజివీడులో పెరిగిన పింఛను నగదు రూ.3 వేలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- ఏలూరులో విలేకరుల సమావేశంలో వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనేక సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజారంజకంగా పరిపాలన అందిస్తూ ఉంటే దానిని ఓర్వలేక ఎల్లో మీడియాలో అసత్య కథనాలు ప్రచారం చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో హాస్టళ్ళలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులను తప్పుదారి పట్టించి వారిని గందరగోళానికి గురి చేయడానికి వారికి వసతులు లేవని పచ్చపత్రికలు కథనాలు రాయడం హేయమన్నారు. జిల్లాలో హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు శీతాకాలంలో చలి నుంచి రక్షణ కల్పించడానికి 4,731 రగ్గులు అందజేశామని స్పష్టం చేశారు. జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా జిల్లాలో 32 వేల మంది తల్లుల ఖాతాలకు ప్రతి ఏటా రూ.353 కోట్లు జమ చేస్తున్నామని, పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా తాను ప్రతి వారం ప్రభుత్వ పాఠశాలలను, వసతి గృహాలను సందర్శించి విద్యాబోధనా, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలిస్తున్నానని, సంతృప్తికరంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలో బోధనను మెరుగుపరచడంతో పాటు, వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. గోరుముద్ద పథకం ద్వారా వారంలో 5 రోజులు కోడిగుడ్లు, చిక్కీలు వంటి పౌష్టికాహారం అందిస్తున్నామని స్పష్టం చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ప్రగతిశీల పాలన అందిస్తున్నారని, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా విద్యాదీవెన పథకం కింద పూర్తి ఫీజును ఏడాదికి నాలుగు విడతలుగా తల్లుల ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. విదేశీ విద్యా దీవెన కింద అంతర్జాతీయంగా పేరుగాంచిన విదేశీ విశ్వవిద్యాలయాల్లో మన జిల్లా విద్యార్థులు చదివేందుకు రూ.96 లక్షలు అందిస్తున్నామన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆర్‌వీ నాగరాణి మాట్లాడుతూ కేవలం మధ్యాహ్న భోజనమే కాక సాయంత్రాలు హాస్టళ్లలో కూడా మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. నెల కోసారి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. ఇప్పటికే నాడు – నేడు కార్యక్రమం కింద పాఠశాలలను అభివృద్ధి చేస్తుండగా హాస్టళ్లలో కూడా పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించడానికి నాడు – నేడు పనులు చేపట్టాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

వడ్డి కుల కార్పొరేషన్ చైర్మన్‌గా ముంగర ప్రమాణ స్వీకారం



ముంగరతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యేలు కొఠారు, డీఎన్నార్, వాసుబాబు

ఏలూరు రూరల్: కొల్లేరు నాయకుడు ముంగర సంజీవ్‌కుమార్‌ను వడ్డి కుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొల్లేరు ప్రజలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారని కైకలూరు, ఉంగుటూరు, దెందులూరు ఎమ్మెల్యేలు దూలం నాగేశ్వరరావు, పుప్పాల వాసుబాబు, అబ్బయ్యచౌదరి కొనియాడారు. ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడులో బుధవారం నిర్వహించిన వడ్డి కుల కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఎమ్మెల్యేలు మాట్లాడారు. గతంలో టీడీపీ నాయకులు కొల్లేరు ప్రజల మధ్య చిచ్చురేపి ఎన్నికల్లో లబ్ధి పొందారని గుర్తు చేశారు. కొల్లేరు గ్రామాల్లో టీడీపీ కనుమరుగైందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో అర్హులు అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ కొల్లేరు ప్రజల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యేలు దూలం నాగేశ్వరరావు, పుప్పాల వాసుబాబు, అబ్బయ్యచౌదరి వడ్డి కుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సంజీవ్‌కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఏసీ మెకానిక్ ఆత్మహత్య



క్రాంతికుమార్ మృతదేహం

నిడమర్రు: కుటుంబంలో గొడవలతో మనస్తాపానికి గురై పురుగుమందు తాగి ఓ ఏసీ మెకానిక్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన అయితం క్రాంతికుమార్ (28) నిడమర్రు మండలం తోకలపల్లికి చెందిన గంగారత్నంతో 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొంతకాలంగా క్రాంతికుమార్ చెడు అలవాట్లకు బానిసై భార్యను కొడుతుండటంతో పెద్దల్లో మధ్య రాజీ చేసినా అతనిలో మార్పు రాలేదు. దీంతో భార్య గత నెల 29న పుట్టింటికి వెళ్లి నిడమర్రు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో మంగళవారం పిల్లలను చూసేందుకు నిడమర్రు వచ్చిన క్రాంతికుమార్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అతనిని 108లో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై ఆర్ శ్రీను కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'సీఆర్‌ఆర్'లో ఎన్నికల ఏర్పాట్ల ముందస్తు పరిశీలన



ఏలూరులోని సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్పీ, అధికారులతో కలిసి కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఏలూరు జిల్లాలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల ముందస్తు పరిశీలనలో భాగంగా సంబంధిత ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం స్థానిక సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలను ఎస్పీ డి.మేరీ ప్రశాంతితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ప్రతి సార్వత్రిక ఎన్నికల సందర్భంలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాన్ని ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రానున్న 2024 సంవత్సరం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఒక పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ గదులు, రిసెప్షన్స్, పోస్టల్ బ్యాలెట్స్, సపరేట్ కౌంటింగ్ గదులు, బస్ పార్కింగ్‌లు, ఎన్నికల అబ్జర్వర్ల వేచి ఉండే ప్రత్యేక రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రానికి ఇన్, అవుట్ మార్గాలు, సైన్ బోర్డులు ఏర్పాటు, పోలీస్ సిబ్బంది వేచి ఉండే ప్రదేశం, తదితర అంశాలపై పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఏలూరు ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలి, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ బి.సోమశేఖర్, డీపీసీ రమణ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, కాలేజీ ప్రిన్సిపాల్, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ ఆకస్మిక తనిఖీ



ఏలూరులో సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో స్టాక్‌ను తనిఖీ చేస్తున్న జేసీ బి.లావణ్యవేణి

ఏలూరు (మెట్రో): ఏలూరులోని సివిల్ సప్లయిస్ గోడౌన్ (ఎంఎల్ఎస్)ను జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గోడౌన్‌లో రికార్డులను పరిశీలించి ప్రతి నెలా ఒకటో తేదీలోగా ఏలూరు ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో గల అన్ని రేషన్ షాపులకు బియ్యం, కందిపప్పు, పంచదార, అంగన్‌వాడీ సరుకులు, ఎండీఎం సరుకులు వగైరా నిత్యావసర సరుకులు త్వరితగతిన సప్లయి చేయాల్సిందిగా ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిని ఆదేశించారు. ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఉన్న స్టేజ్–1 లారీలను పరిశీలించి సరుకులను వెంటనే దిగుమతి చేసుకుని ఆన్‌లైన్ రికార్డులో నమోదు చేయలని ఇన్‌చార్జికి సూచించారు. టేక్ హోం రేషన్ సరుకుల రవాణాపై సివిల్ సప్లయి జిల్లా మేనేజర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న హమాలీల హాజరుపట్టికను జేసీ పరిశీలించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎగుమతి, దిగుమతి ఖర్చులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. మండల స్టాక్ పాయింట్‌లో పనిచేస్తున్న గోడౌన్ ఇన్‌చార్జి, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను గోడౌన్ నిర్వహణ తీరుపై ఆరా తీసి రికార్డులను పరిశీలించి సంతృప్తికరంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని హెచ్చరించారు. జేసీ వెంట సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ప్రజాదీవెన యాత్రకు జననీరాజనం

- 2వ రోజు అత్తిలిలో కొనసాగిన మంత్రి కారుమూరి పాదయాత్ర



అత్తిలిలో పాదయాత్రలో మహిళల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి కారుమూరి

అత్తిలి : అవినీతికి తావులేకుండా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజలు విశేష ఆదరాభిమానాలు చూపిస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంత్రి చేపట్టిన ప్రజాదీవెన పాదయాత్ర రెండో రోజు బుధవారం అత్తిలి పెదపేట నుంచి సంతమార్కెట్ సెంటర్, గణేష్ చౌక్, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, పడవలరేవు, గోగులమ్మపేట, రామన్నపేట వరకు సాగింది. అడుగడుగునా మహిళలు మంత్రి కారుమూరికి హారతులిచ్చి, ఘనస్వాగతం పలికారు. వృద్ధులు, వికలాంగులు, చిన్నారులను మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ పాదయాత్ర కొనసాగించారు. తామంతా మీవెంటే ఉంటామని, తిరిగి జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మహిళలు మంత్రికి ముక్తకంఠంతో తెలిపారు. స్థానిక సమస్యలపై మహిళలు,ప్రజలు మంత్రి దృష్టికి తీసుకురావడంతో వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధితశాఖ అధికారులను మంత్రి కారుమూరి ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మంత్రి కారుమూరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పరిపాలన చేస్తున్నారన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి, 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలను అందించిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా గడపవద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, లేకపోతే మరలా ప్రజాధనాన్ని దోచుకునే పాలకులు వస్తారన్నారు. తాను చేపట్టిన ప్రజాదీవెన పాదయాత్రలో ప్రజలందరూ కలిసికట్టుగా తనతో నడుస్తున్నారని, ప్రతి గడపలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మంత్రి చెప్పారు. మంత్రి వెంట పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూత సకాలంలో వచ్చేనా!

- జనవరి మొదలైనా మామిడి చెట్లకు కానరాని పూత
- ఏటా ఇదే సమయానికి 60 శాతంతో తోటలు కళకళ
- ప్రస్తుతం 20 శాతమే ఉండటంతో రైతుల్లో గుబులు



నూజివీడు: నూజివీడు డివిజన్‌లో ప్రధాన వాణిజ్య పంటగా ఉన్న మామిడిపై ఈ ప్రాంత రైతులు ఆశలు పెట్టుకుని పూతల కోసం ఎదురుచూస్తున్నారు. నూజివీడు డివిజన్‌లోని ఆరు మండలాల్లో ప్రధాన వాణిజ్య పంటగా భాసిల్లుతున్న మామిడిపై ఈ ప్రాంత రైతులు సహజంగానే ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో 50 వేల ఎకరాలలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఎక్కువగా బంగినపల్లి, కలెక్టర్(తోతాపురి), చిన్న, పెద్ద రసాలు వంటి రకాలను రైతులు సాగు చేస్తున్నారు. మామిడి పూతలు సాధారణంగా డిసెంబర్ ప్రారంభం నుంచి ఫిబ్రవరి వరకు రావడం జరుగుతుంది. ఇందు కోసం రాత్రిపూట అధిక చలి, పగటిపూట అధిక ఉష్ణోగ్రతలు ఉండాలి. తుపాను ప్రభావంతో ఇటీవల భారీ వర్షాలు పడటం, ఆ తరువాత పగటిపూట ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పూతలు రావడం జాప్యం కావచ్చని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తుపాను తరువాత కనపడని పూత

గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో సంభవించిన తుపాను ప్రభావం మామిడిపై పడిందని రైతులు లబోదిబోమంటున్నారు. తుపానుకు ముందు మామిడి తోటల్లో పూతలు స్పీడుగా రాగా, తుపాను తరువాత నుంచి పూతలు రావడం నిలిచిపోయిందని వాపోతున్నారు. ప్రతి ఏటా ఈ సమయానికి 60 శాతం తోటల్లో పూతలు రావాల్సి ఉండగా కేవలం 20 శాతం తోటల్లో మాత్రమే పూతలు కనిపిస్తుండగా, ఇవి కూడా బంగినపల్లి, కలెక్టర్ రకాల్లో కనిపిస్తున్నాయి. అంతేగాకుండా వచ్చిన పూతలో కొంతభాగం పూత తుపాను వల్ల కురిసిన వర్షాలకు మాడిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. జనవరిలో ప్రవేశించినా పూతల జాడ తోటల్లో కనిపించకపోవడంతో పూతల కోసం రైతులు రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. రైతులు పూతల కోసం మల్టీ కే, సల్ఫర్, క్లోరీఫైరిఫాస్, ఇమిడాక్లోప్రిడ్ వంటి మందులను పిచికారీ చేస్తున్నారు. తెల్లపూత కనిపిస్తున్నా పిందె కావడం లేదని రైతులు వాపోతున్నారు.

తుపాను వల్లే పూత ఆలస్యం



తుపాను కారణంగా మామిడి తోటల్లో పూత రావడం బాగా ఆలస్యమవుతోంది. పూతల కోసం రసాయన మందులను పిచికారీ చేస్తున్నాం. తుపానుకు ముందు పూతలు వేగంగా రాగా, ఆ తరువాత మందకొడిగా వస్తున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రత కూడా తక్కువగా ఉండటం మామిడి పూతలపై ప్రభావం చూపుతోంది.

– దోసకాయల రమేష్‌బాబు, మామిడి రైతు, పడమర దిగవల్లి, నూజివీడు మండలం

ఈ మందులు పిచికారీ చేయండి



మామిడి తోటల్లో పూతలు రావడానికి మల్టీ కే 10గ్రాములు లీటరు నీటికి, బోరాన్, జింక్ లీటరు నీటికి 2గ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలి. అలాగే నల్లగంధకం 3గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. తామర, తేనె మంచు పురుగుల ఉధృతి నివారణకు వేపనూనె 1500 పీపీఎం 3 ఎంఎల్ లీటరు నీటికి లేదా క్లోరిఫైరిఫాస్ 2.5 ఎంఎల్ లీటరు నీటికి లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

– ఆర్.హేమ, ఉద్యాన అధికారిణి, నూజివీడు